

SPECIAL PAGE


# అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 294 | వరంగల్ | గురువారం, 27 ఆగస్టు 2026 | పేజీలు: 6


తెలంగాణ రాజకీయాల్లో సుదీర్ఘ ప్రస్థానం.. ఎన్టీఆర్ నుంచి కేసీఆర్ వరకు అగ్రనేతలతో సాన్నిహిత్యం.. ఎమ్మెల్యేగా ఐదుసార్లు విజయం.. అనూహ్యంగా ఎంపీగా గెలుపు.. ఆ తర్వాత మంత్రిగా బాధ్యతలు.. ఇలా నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రయాణాన్ని సాగించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తన జీవితంలోని కీలక ఘట్టాలను తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో పంచుకున్నారు. చిన్ననాటి రాజకీయ ఆసక్తి నుంచి ఎన్టీఆర్‌ను కలిసిన సందర్భం, టీడీపీ ఆవిర్భావంలో తన పాత్ర, వరుస విజయాలు, వైఎస్ ఇచ్చిన మంత్రి పదవి ఆఫర్‌ను తిరస్కరించడం, కేసీఆర్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేయడం, తాజా రాజకీయ పరిణామాల వరకు తన ప్రస్థానాన్ని వివరించారు. "రాజకీయాల్లో ఆస్తులు అమ్ముకున్నానే కానీ అక్రమంగా సంపాదించుకోలేదు" అని స్పష్టం చేసిన దయాకర్‌రావు.. "ఎక్కడ అవకాశం వచ్చినా పోటీ చేస్తా.. రాజకీయ వారసులను దింపే ఆలోచన లేదు" అని భవిష్యత్‌పై తన వైఖరినీ వెల్లడించారు.

*- అక్షరశక్తి, ప్రధానప్రతినిధి*

# పార్టీ.. ప్రజలకోసమే పనిచేసిన..

**రాజకీయాల్లో ఆస్తులు అమ్ముకున్నా.. అక్రమంగా సంపాదించలేదు!**



- ఎన్టీఆర్‌తో తొలి పరిచయం నుంచి టీడీపీ ఆవిర్భావంలో కీలక పాత్ర
- వర్ధన్నపేట నుంచి హ్యాట్రిక్.. వరంగల్ ఎంపీగా అనూహ్య విజయం
- వైఎస్ మంత్రి పదవి ఆఫర్ చేసినా.. కాంగ్రెస్‌లోకి వెళ్లని దయాకర్‌రావు
- కేసీఆర్‌తో సాన్నిహిత్యం.. 2018లో ఆరోసారి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి
- ఎంజీఎం అభివృద్ధికి ప్రత్యేక చొరవ.. ఆస్పత్రికి రూ.2 కోట్ల నిధుల సమీకరణ
- ఎక్కడ అవకాశం వచ్చినా పోటీ చేస్తా.. వారసులను రాజకీయాల్లోకి దింపను
- తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్

# హన్మకొండలో ఉద్రిక్తత

- పాలిటెక్నిక్ విద్యార్థుల ఉద్యమానికి మద్దతుగా బీఆర్ఎస్
- హన్మకొండలో అప్రమత్తమైన పోలీసులు
- హరీశ్‌రావు, దాస్యం, పలువురు నేతల అరెస్టు



వరంగల్‌లో పాలిటెక్నిక్ విద్యార్థుల ఉద్యమానికి బీఆర్ఎస్ మద్దతు తెలిపిన నేపథ్యంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఇదే సమయంలో విద్యార్థుల వద్దకు వెళ్లకుండా.. బీఆర్ఎస్ ఎల్పీ ఉప నేత తన్నీరు హరీష్ రావును, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌కుమార్‌తో పాటు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవితలను, తదితర బీఆర్ఎస్ నాయకులను హనుమకొండ సుబేదారి పోలీసులు అరెస్ట్ చేశారు. *- అక్షరశక్తి, హన్మకొండ*

3





## భూపాలపల్లి మైన్స్ ఏడీ ఇళ్లపై
# ఏసీబీ సోదాలు

- నగదు, బంగారం, ఆస్తి పత్రాలు, బ్యాంకు ఖాతాల పరిశీలన
- 12 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మైన్స్ ఏడీ బొజ్జ జయరాజు నివాసాలు, కార్యాలయాలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు.

*- అక్షరశక్తి, భూపాలపల్లి*



4

# ప్రతి గ్రామం పచ్చదనం, పరిశుభ్రతతో ఉండాలి

**కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**







**అక్షరశక్తి,హన్మకొండ:** ప్రతి గ్రామం పచ్చదనం, పరిశుభ్రతతో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. గురువారం ఆత్మకూరు మండలం కొత్తగట్టు గ్రామంలో కలెక్టర్ పర్యటించారు. గ్రామంలోని సెగ్రిగేషన్ షెడ్‌లో సేంద్రియ ఎరువు తయారీని పరిశీలించి, ఇప్పటివరకు తయారైన ఎరువుల విక్రయాలు, వాటి ద్వారా వచ్చిన ఆదాయం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి వంట తయారీని పరిశీలించారు. పిల్లల హాజరును తెలుసుకుని, వారికి వివిధ పండ్ల పేర్లను అడిగి వారి అభ్యసన తీరును పరిశీలించారు. చిన్నప్పటి నుంచే పిల్లల్లో నేర్చుకోవాలనే ఆసక్తి పెంపొందేలా ఆటపాటలతో కూడిన బోధన అందించాలని సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలోని మూడో తరగతిని సందర్శించిన కలెక్టర్ విద్యార్థులకు గణితంలోని కొన్ని లెక్కలు ఇచ్చి వారి అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి మరుగుదొడ్లను ప్రతిరోజూ పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీటి వసతి, ఆర్వో ప్లాంట్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నిర్మించిన ఫామ్ పాండ్‌ను పరిశీలించి, గ్రామానికి చెందిన వీరబోయిన అశోక్ తన స్థలంలో నిర్మించనున్న ఫామ్ పాండ్‌కు భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలో పర్యటిస్తూ ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, మరుగుదొడ్డి ఉండేలా చూడాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి వివరాలను తెలుసుకున్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ గ్రామస్తులకు సూచించారు. వన మహోత్సవంలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీజ, డీఆర్డీఓ మేన శ్రీను, డీపీఓ లక్ష్మీ రమాకాంత్, ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఓటు పరిరక్షణే SIR-2 లక్ష్యం

**అక్షరశక్తి,భువనగిరి:** బోనగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో SIR2 వార్డు సభ నిర్వహించారు. ప్రజలకు చేరువగా ఉండేందుకు ఎమ్మెల్యే వారితో కలిసి నేలపై కూర్చొని సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవాలని, ఓటు తొలగింపులు లేదా తప్పులు ఉంటే బీఎల్ఓలను సంప్రదించి సరిచేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. SIR2లో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని ఓటు హక్కును పరిరక్షించుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ SIR కోఆర్డినేటర్ ఇ.వి. శ్రీనివాస్ రావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



# విద్యుత్ సరఫరా, వినియోగదారుల సేవలపై సమీక్ష



**అక్షరశక్తి,జనగాం:** వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సేవలు అందించడంతో పాటు విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ ఆపరేషన్స్ టి. మధుసూదన్ అధికారులను ఆదేశించారు. గురువారం జనగాం సర్కిల్ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆర్‌టీఎఫ్ఎంఎస్, ఎఫ్‌పీఐ వ్యవస్థల పనితీరు, వ్యవసాయ విద్యుత్ సరఫరా, వినియోగదారుల సమస్యల పరిష్కారం, విద్యుత్ అంతరాయాలపై సమీక్షించారు. ఫీడర్లలో లోపాలను ఎఫ్‌పీఐ ద్వారా వేగంగా గుర్తించి, సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించాలని, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ముందస్తు నిర్వహణ చర్యలు చేపట్టాలని సూచించారు. సర్కిల్‌లోని కెపాసిటర్ బ్యాంకుల పనితీరును సమీక్షిస్తూ వోల్టేజ్ స్థిరీకరణ, విద్యుత్ నాణ్యత మెరుగుదల, సాంకేతిక నష్టాల నియంత్రణకు వాటిని క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని తెలిపారు. పెండింగ్ వర్క్ ఆర్డర్లను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని, పూర్తయిన పనులకు సంబంధించిన ప్రక్రియలను ఆలస్యం చేయకుండా ముగించాలని ఆదేశించారు. పారిశ్రామిక వినియోగదారులకు టీజీఐపాస్ ద్వారా కొత్త విద్యుత్ సర్వీసుల మంజూరులో ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత సమయంలో సేవలు అందించాలని, వ్యవసాయ సర్వీసుల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కాలిపోయిన, పనిచేయని మీటర్లను గుర్తించి వెంటనే కొత్త మీటర్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రెవెన్యూ వసూళ్ల పురోగతిని సమీక్షించిన డైరెక్టర్ ఆపరేషన్స్, బకాయిల వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి సెక్షన్ వారీగా నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న, ప్రతిపాదిత కొత్త సబ్‌స్టేషన్ల పనులను సమీక్షించి, అవసరమైన చోట భూమి లభ్యత ప్రక్రియను వేగవంతం చేయాలని, భవిష్యత్ విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సబ్‌స్టేషన్ సామర్థ్యాన్ని పెంచాలని తెలిపారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజనీర్ కె. గౌతం రెడ్డి, జనగాం సూపరింటెండింగ్ ఇంజనీర్ చెరుకు సంపత్ రెడ్డి, ఆపరేషన్ డీఈ లక్ష్మీనారాయణ రెడ్డి, ఘనపూర్ ఆపరేషన్ డీఈ సారయ్య, డీఈ ఎంఆర్‌టీ విజయ్ కుమార్, ఎస్ఏఓ శంకర్, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతీ ఒక్కరి ఓటును కాపాడాలి

- **తెలంగాణ రాష్ట్ర ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి**
- **నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో గ్రామ సభలు, వార్డు సభలు**



**అక్షరశక్తి, నిజామాబాద్:** ఏఐసీసీ, టీపీసీసీ అధ్యక్షుల ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామ సభలు, వార్డు సభల్లో భాగంగా నిజామాబాద్ జిల్లా అర్బన్,రూరల్ నియోజకవర్గాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల కోఆర్డినేటర్, తెలంగాణ రాష్ట్ర ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఫారం 6 ద్వారా కొత్త ఓటును నమోదు చేసుకోవడం, ఫారం 7 ద్వారా మరణించిన వారు లేదా ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి ఓట్లను తొలగించేందుకు దరఖాస్తు చేయడం, ఫారం 8 ద్వారా పేరు,పుట్టిన తేదీ,చిరునామా తదితర వివరాల్లో తప్పులను సరిచేసుకోవడం వంటి అంశాలను ప్రజలకు వివరించారు.

ఈ సందర్భంగా జంగా రాఘవ రెడ్డి మాట్లాడుతూ... ప్రతీ అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన అంశమని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలనే లక్ష్యంతో రాజీవ్ గాంధీ హయాంలో తీసుకువచ్చిన ఓటు హక్కు సంస్కరణల స్ఫూర్తిని కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా నోటీసులు జారీ చేయడం,అభ్యంతరాలు, దరఖాస్తులకు గడువులు విధించడం వంటి అంశాలపై ప్రజల్లో అనేక సందేహాలు ఉన్నాయని ఆయన అన్నారు.అర్హులైన ఓటర్ల పేర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగిపోకుండా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన కోరారు. నిజామాబాద్ జిల్లాలో సుమారు 1.09 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ అయ్యాయని,మొత్తం ఓట్లు సుమారు 3.09 లక్షలుగా ఉన్నాయని ఆయన తెలిపారు. డ్రాఫ్ట్ ప్రక్రియలో సుమారు 2 లక్షల మంది వివరాలు అందుబాటులోకి వచ్చాయని,మరో 87 వేల మంది వివరాలు డ్రాఫ్ట్‌లో నమోదు కాలేదని పేర్కొంటూ, ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ తరపున ప్రజలకు అవగాహన కల్పిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పరిరక్షించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఓటర్ల జాబితా నుంచి అనర్హుల పేర్లు తొలగించడంతో పాటు,అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా అన్యాయంగా తొలగిపోకుండా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు.ప్రజలు తమ ఓటు వివరాలను స్వయంగా పరిశీలించుకోవాలని, ఏవైనా తప్పులు ఉంటే సంబంధిత ఫారాలను ఉపయోగించి సవరణలు చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు బీఎల్ఏల సహకారంతో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలిస్తూ, కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువతను ఓటర్లుగా నమోదు చేయించడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడేందుకు కృషి చేస్తున్నారని జంగా రాఘవ రెడ్డి తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని,రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల మధ్య ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షులు టౌన్ పార్టీ అధ్యక్షులు కార్పొరేటర్ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, బీఎల్ఏలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో జనగణనకు గెజిట్ నోటిఫికేషన్

**అక్షరశక్తి, హైదరాబాద్:** తెలంగాణలో జనగణన 2027కు సంబంధించి ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. జనగణనకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను మరోసారి ప్రచురించాలని ఆదేశించింది. ఈ మేరకు ఆగస్టు 29న తెలంగాణ గెజిట్‌లో నోటిఫికేషన్ ప్రచురించనున్నారు. సెన్సెస్ 2027లో భాగంగా ప్రజలకు సంబంధించిన మొత్తం 40 రకాల వివరాల సేకరణకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. జనగణనలో భాగంగా ప్రతి వ్యక్తికి సంబంధించిన ప్రాథమిక వివరాలను సేకరించనున్నారు. ఇందులో పేరు, వయస్సు, లింగం, వైవాహిక స్థితి వంటి వివరాలు ఉంటాయి. అలాగే కులం, మతం, ఎస్సీ, ఎస్టీ తదితర వివరాలను కూడా నమోదు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. విద్యార్హతలు, ఉద్యోగం, వృత్తి తదితర వివరాలను కూడా జనగణనలో నమోదు చేయనున్నారు. ఒక వ్యక్తి ఏ రంగంలో పనిచేస్తున్నారు? వారి వృత్తి ఏమిటి? వంటి అంశాలను కూడా సేకరించనున్నారు. ప్రజల వలసలకు సంబంధించిన సమాచారాన్ని కూడా సెన్సెస్ 2027లో నమోదు చేయనున్నారు. వ్యక్తి పుట్టిన ప్రదేశం, ప్రస్తుతం ఎక్కడ నివసిస్తున్నారు, గతంలో ఎక్కడ నివసించారు వంటి వివరాలను సేకరించనున్నారు. బ్యాంక్ ఖాతాలు, మొబైల్ నంబర్ వంటి వివరాల సేకరణకు కూడా అవకాశం కల్పించారు. అదేవిధంగా ఆధార్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్ వంటి గుర్తింపు పత్రాల వివరాలను నమోదు చేసే అవకాశం ఉంటుందని గెజిట్‌లో పేర్కొన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉందా? లేదా? అనే వివరాలను కూడా సేకరించాలని గెజిట్‌లో పేర్కొన్నారు.

# హన్మకొండలో ఉద్రిక్తత

- పాలిటెక్నిక్ విద్యార్థుల ఉద్యమానికి మద్దతుగా బీఆర్ఎస్
- హన్మకొండలో అప్రమత్తమైన పోలీసులు
- హరీశ్‌రావు, దాస్యం, పలువురు నేతల అరెస్టు



**అక్షరశక్తి, హన్మకొండ:** వరంగల్‌లో పాలిటెక్నిక్ విద్యార్థుల ఉద్యమానికి బీఆర్ఎస్ మద్దతు తెలిపిన నేపథ్యంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఇదే సమయంలో విద్యార్థుల వద్దకు వెళ్లకుండా.. బీఆర్ఎస్ ఎల్పీఉప నేత తన్నీరు హరీష్ రావును, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌కుమార్‌తో పాటు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవితలను, తదితర బీఆర్ఎస్ నాయకులను హనుమకొండ సుబేదారి పోలీసులు అరెస్ట్ చేశారు. అంతకుముందు.. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ ఉద్యోగుల ఆందోళనకు హరీష్ రావు మద్దతు తెలిపి మాట్లాడారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఆందోళనకు వెళుతున్నారనే సమాచారంతో లా అండ్ ఆర్డర్, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ పార్టీ పోలీసులు చేరుకున్నారు. ఉద్యోగుల ధర్నాకు సంఘీభావం తెలిపిన తర్వాత హరీష్ రావును అరెస్ట్ చేసే ప్రయత్నం చేయగా, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. హరీష్ రావును సమీపంలోని సుబేదారి పోలీసు స్టేషన్ కు కాలినడకన తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు సుబేదారి పీఎస్ కు తరలివచ్చి స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేశారు. ఈ సుబేదారి పోలీస్ స్టేషన్ వద్ద హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. పాలిటెక్నిక్ పిల్లలపై అత్యంత కర్కశంగా గొంతులు నొక్కుతూ, భౌతిక దాడులు చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నారని, విద్యాశాఖ మంత్రిగా రేవంత్ రెడ్డి ఉండటం దౌర్భాగ్యమని అన్నారు. రేవంత్ రెడ్డి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం క్రిమినల్ వేస్ట్ అని విద్యార్థులు విమర్శిస్తున్నారని, అసలు పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో కలపమని నీకు ఎవరు చెప్పారు రేవంత్ రెడ్డి? అని ప్రశ్నించారు. పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో కలపడం అంటే.. ప్రైవేట్‌పరం చేయడమేనని హరీశ్‌రావు అన్నారు.

**బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్**

వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. జీవో 97 రద్దు చేయాలని నిరసనలు తెలుపుతున్న వరంగల్ పాలిటెక్నిక్ విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు మాజీ మంత్రి హరీశ్ రావు వస్తున్న నేపథ్యంలో వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల దగ్గర పోలీసులు భారీగా మోహరించారు. కళాశాలకు వచ్చే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి పంపిస్తున్నారు. 4, 5 కంటే ఎక్కువగా కలిసి వచ్చే విద్యార్థులను అడ్డుకున్నారు. అంతకుముందు వరంగల్, హనుమకొండలో విద్యార్థి నాయకులను అరెస్టు చేశారు. ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. కాగా, పాలిటెక్నిక్ కళాశాలకు వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డిని అడ్డుకుని అక్కడి నుంచి పంపించారు.

### అన్నివర్గాలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్**

ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాన్ని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అణిచివేయాలని చూస్తోందని, కాంగ్రెస్ నియంతృత్వ చర్యలు ప్రజాస్వామ్య హక్కుల హననం చేస్తున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం G.O. 97 ద్వారా విద్యార్థులపై అమలు చేస్తున్న కఠిన విధానాలను ప్రశ్నిస్తున్న నాయకులను అణచివేయాలని చూస్తోందని ఆరోపించారు. శాంతియుతంగా విద్యార్థులకు అండగా నిలవాలనుకున్న తమ నాయకుడు హరీష్‌రావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని అన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, అక్రమ నిర్బంధాలు, ముందస్తు అరెస్టులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళనలను అణచివేసే ప్రయత్నాలను మానుకోవాలన్నారు. దేశంలో జెన్ జీ ఉద్యమం నడుస్తోందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి, ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ఈ రెండున్నర ఏళ్ల పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం చేస్తోందని అన్నారు. పేదల భూములు 22ఎ పేరుతో లాక్కోవాలని చూస్తోందని ఆరోపించారు. 6 గ్యారంటీలు, 420 హామీలు అమలు చేసే వరకు తెలంగాణ ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాడుతోందని అన్నారు.



# అంతర్జాతీయ పరిశోధనకు కేయూ ఫార్మసీతో జెడ్డా వర్సిటీ భాగస్వామ్యం

**అక్షరశక్తి, కేయూ క్యాంపస్ :** సౌదీ అరేబియాలోని జెడ్డా కింగ్ అబ్దులఅజీజ్ యూనివర్సిటీ ఫార్మకాలజీ ప్రొఫెసర్ ఆఫ్తాబ్ అహ్మద్ కాకతీయ విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌ను సందర్శించారు. ఆచార్య గాదె సమ్మయ్య ఆహ్వానం మేరకు వచ్చిన ఆయన కళాశాలలోని విద్యా సౌకర్యాలు, పరిశోధనా ప్రయోగశాలలను పరిశీలించి, అధ్యాపకుల పరిశోధనలను అభినందించారు. ఈ సందర్భంగా పీహెచ్‌డీ పరిశోధకులు, మాస్టర్స్ విద్యార్థులు, అధ్యాపకులకు అకాడమిక్ ఉపన్యాసం ఇచ్చారు. ఫార్మాస్యూటికల్, హెల్త్ సైన్సెస్ రంగాల్లో నాణ్యమైన పరిశోధనలు చేపట్టాలని సూచించారు. కేయూ ఫార్మసీ కళాశాలతో పరిశోధనా సహకారం ఏర్పాటు చేసేందుకు ప్రొఫెసర్ ఆఫ్తాబ్ అహ్మద్ అంగీకరించారు. ఇందుకోసం కింగ్ అబ్దులఅజీజ్ యూనివర్సిటీ ద్వారా ఎంఓయూ చేసేందుకు, పరిశోధన వ్యయంతో పాటు ప్రాజెక్టు అసిస్టెంట్‌కు ఫెలోషిప్ అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఫార్మకాలజీ, ఫార్మాకోవిజిలెన్స్, ఔషధ భద్రత, సహజ ఉత్పత్తులు, క్యాన్సర్, న్యూరోఫార్మకాలజీ తదితర రంగాల్లో 25 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న ప్రొఫెసర్ అహ్మద్ 150కి పైగా పరిశోధనా వ్యాసాలు ప్రచురించారు. ప్రపంచంలోని టాప్ 2 శాతం శాస్త్రవేత్తల జాబితాలోనూ పలుమార్లు చోటు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ జానపరెడ్డి కృష్ణవేణి, అధ్యాపకులు నరసింహారెడ్డి, ప్రసాద్, సమ్మయ్య, నాగరాజు, స్వరూపరాణి తదితరులు ప్రొఫెసర్ ఆఫ్తాబ్ అహ్మద్‌ను శాలువా, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. ఆయన పర్యటనను అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

# ఆటో డ్రైవర్లకు తెలంగాణ సర్కార్ శుభవార్త

**అక్షరశక్తి, హైదరాబాద్ :** ఆటో డ్రైవర్లకు తెలంగాణ సర్కార్ శుభవార్త చెప్పింది. ఆటోరిక్షా డ్రైవర్లకు ప్రయోజనం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌తో నడిచే ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు 'తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్ 2026'ను అమలు చేయాలని నిర్ణయించింది. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఇందుకోసం ఏకంగా రూ.200 కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇంధన ధరలు, వాహన నిర్వహణ ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటో డ్రైవర్లకు ఈ పథకం కొంత ఉపశమనం కలిగించే అవకాశం ఉంది. ఈ పథకం ద్వారా సంప్రదాయ ఇంధన వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ ఆటోల వినియోగం పెరగనుంది. పెట్రోల్, డీజిల్ కోసం రోజూ అయ్యే ఖర్చుతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాల నిర్వహణ వ్యయం తగ్గే అవకాశం ఉండటంతో ఆటో డ్రైవర్లకు దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూరనుంది. రూ.200 కోట్ల నిధులతో 18,766 ఆటోలను ఎలక్ట్రిక్‌గా మార్చే ప్రక్రియను ప్రభుత్వం ఎలా అమలు చేస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



# మహిళలకు రాఖీ పౌర్ణమి చీరల పంపిణీ





**అక్షరశక్తి, హన్మకొండ :** రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా గ్రేటర్ వరంగల్ పరిధి 61 డివిజన్ హన్మకొండ ప్రశాంత్ నగర్‌లో ప్రముఖ సామాజిక సేవకులు, సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ ఉపాధ్యక్షులు గొట్టె పుల్లయ్యకు సుమారు 40మంది మహిళలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఎవరికి ఆపద వచ్చినా.. అన్నా అని పిలిస్తే వాలిపోయే పుల్లన్నకు ప్రతీ ఏడాది తాము రాఖీలు కడుతామని మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. పుల్లన్న నిరంతరం అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ ఉంటారని కొనియాడారు. ఈ సందర్భంగా రాఖీ కానుకగా మహిళలకు గొట్టె పుల్లయ్య అనసూయ దంపతులు చీరలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కుటుంబ నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని, అన్నాచెల్లెళ్ల అనుబంధం తెలిపే రాఖీపండుగ సందర్భంగా తనకు రాఖీలు కట్టడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజిక వేత్త పేరాల శ్రీనివాసరావు, శ్రావణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఏఐకేఎంఎస్ 9వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**అక్షరశక్తి, వరంగల్ :** అఖిల భారత రైతు కూలి సంఘం (ఏఐకేఎంఎస్) 9వ రాష్ట్ర మహాసభలు మంచిర్యాల జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 8, 9వ తేదీలలో జరుగుతాయని సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు తెలిపారు. ఈరోజు ఖిలా వరంగల్ పంపు సెంటర్ వై జంక్షన్ నందు మహాసభల పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ మహాసభల మొదటి రోజు సంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్షపతి అధ్యక్షతన జరుగుతుందని ప్రముఖ సంపాదకులు విమర్శకులు రచయిత కే శ్రీనివాస్ ప్రారంభ ఉపన్యాసం ఇస్తారని ముఖ్యఅతిథిగా ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య హాజరవుతారని వక్తలుగా జాతీయ ఉపాధ్యక్షులు రమేందర్ సింగ్ పటియాల జీవి చలపతిరావు ఐఎఫ్టియు జాతీయ ప్రధాన కార్యదర్శి టి శ్రీనివాస్ ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న సహాయ కార్యదర్శి అజ్మీరా లాల్ కుమార్ లు ప్రసంగిస్తారని ఆయన తెలిపారు. రెండవ రోజు సంస్థగత రిపోర్టు రివ్యూ నిర్మాణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని రైతు కూలీలను ఆయన కోరారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు జక్కుల తిరుపతి కోశాధికారి బండి వెంకటేశ్వర్లు ఇనుముల కృష్ణ బండి కుమార్ సుద్దాల వీరయ్య ఎండి అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యోగ సంఘాల మహా ధర్నాకు పీడీఎస్‌యూ మద్దతు



**అక్షరశక్తి, హన్మకొండ :** తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు తమ డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల ముందు చేపట్టిన మహాధర్నా కు పి.డి.ఎస్.యు. సంపూర్ణ మద్దతు తెలిపింది. గురువారం హన్మకొండ జిల్లా కలెక్టరేట్ ముందు టీజీఈజేఏసీ (తెలంగాణ రాష్ట్ర ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ) ఆధ్వర్యంలో జరిగిన మహా ధర్నాలో పి.డి.ఎస్.యు. ప్రతినిధి బృందం పాల్గొని సంఘీభావం, సంపూర్ణ మద్దతు తెలియజేసింది. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఉద్యోగస్తుల అభివృద్ధి పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న తక్షణమే సీపీఎస్‌ను రద్దుచేసి, ఓపీఎస్‌ను అమలు చేయాలని, ఉద్యోగస్తుల 2వ పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, ఉద్యోగస్తుల 6 డీఏలను వెంటనే విడుదల చేయాలని, నూతన ఈహెచ్ఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహారావు, వరంగల్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు బోయినపల్లి అజయ్, రాష్ట్ర గర్ల్స్ కోకన్వీనర్ పి. అనూష, వంశీ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## కంటి ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

**అక్షరశక్తి,హనుమకొండ:** కంటి ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ తిప్పర్తి రాఘవరెడ్డి సూచించారు. గురువారం శరత్ మ్యాక్స్ విజన్ ఆధ్వర్యంలో సాయిబాబా మందిరంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. చూపులో చిన్న మార్పు కనిపించినా వెంటనే నేత్ర వైద్యులను సంప్రదించాలని సూచించారు. కంటి సమస్యలను ప్రారంభ దశలో గుర్తించి చికిత్స పొందాలని హరగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో మందిర ధర్మకర్త, పీఆర్వో నిమ్మల శ్రీనివాస్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# భూపాలపల్లి మైన్స్ ఏడీ ఇళ్లపై ఏసీబీ సోదాలు

- నగదు, బంగారం, ఆస్తి పత్రాలు, బ్యాంకు ఖాతాల పరిశీలన
- 12 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు



**అక్షరశక్తి, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మైన్స్ ఏడీ బొజ్జ జయరాజు నివాసాలు, కార్యాలయాలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణల నేపథ్యంలో వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య నేతృత్వంలో ఈ తనిఖీలు కొనసాగుతున్నట్లు సమాచారం. భూపాలపల్లి, ములుగు, వరంగల్, హైదరాబాద్‌లోని బోడుప్పల్‌తో పాటు సూర్యాపేట, తాండూరు తదితర ప్రాంతాల్లో సుమారు 12 చోట్ల ఏసీబీ బృందాలు ఏకకాలంలో తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ సోదాల్లో నగదు, బంగారం, ఆస్తి పత్రాలతో పాటు బ్యాంకు ఖాతాలు, లాకర్లు, ఇతర ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. బొజ్జ జయరాజు గతంలో ములుగు జిల్లా మైన్స్ ఏడీగా పనిచేసిన సమయంలో ఇసుక, మట్టి క్వారీల వ్యవహారాల్లో అవకతవకలకు పాల్పడ్డారంటూ ఆరోపణలు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఏసీబీ సోదాలు జరగడం చర్చనీయాంశంగా మారింది. వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న తనిఖీల్లో కీలక పత్రాలు, ఆస్తులకు సంబంధించిన వివరాలను అధికారులు సేకరిస్తున్నట్లు సమాచారం. అయితే సోదాలు ఇంకా కొనసాగుతున్నందున స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం, ఆస్తుల విలువ తదితర పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది. ఏసీబీ అధికారుల ప్రకటన అనంతరం ఈ వ్యవహారంపై మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ ఛలో డిల్లీ

**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి**




**అక్షరశక్తి, హన్మకొండ :** కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ 1న సిపిఐ ఛలో డిల్లీ కార్యక్రమం తలపెట్టిందని, సెప్టెంబర్ 1న జరిగే ఛలో డిల్లీని విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ మండలంలోని గుండ్ల సింగారం సురవరం సుధాకర్ రెడ్డి నగర్ లోని ముఖ్య కార్యకర్తల సమావేశం సిపిఐ మండల సహాయ కార్యదర్శి గుంటీ రాజేందర్ అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి తోట బిక్షపతి హాజరై మాట్లాడుతూ దేశంలో మార్పు కోసం సిపిఐ పోరాటం సాగిస్తోందని అన్నారు. బీజేపీ 12 ఏళ్ల పాలనలో ప్రజలకు ఉపయోగకరమైన ఒక మంచి పని చేయలేక పోయిందని, ధరలను అరికట్టడంలో, ఉద్యోగాల కల్పనలో విఫలమైందని అన్నారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసిందని, సాధారణ పౌరులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టిందని, రైతాంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యము చేసి కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ ఇవ్వడంలో విఫలమయ్యారని, రైతు సంక్షేమాన్ని దెబ్బతీశారని, ఉపాధి హామీని నిర్వీర్యం చేశారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశంలో ఆగస్టు 6 నుండి 14 వరకు దేశ వ్యాప్తంగా సిపిఐ ప్రచార జాత పాదయాత్ర నిర్వహించడం జరిగిందని, పాదయాత్ర జాతల ద్వారా ప్రతి గ్రామంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రజలకు వివరించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా సెప్టెంబర్ 1వ తేదీన లక్షలాది మందితో సిపిఐ ఛలో ఢిల్లీ పిలుపునివ్వడం జరిగిందని అన్నారు. సెప్టెంబర్ 1న జరిగే ఛలో డిల్లీ కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, నాయకులు పూజారి అమృతయ్య, కోడపాక బాబు, మామునూరి దామోదర్, కేతపాక ప్రసాద్, తాటికంటి మమత, గుంటీ రజిత తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల బకాయిలపై బీజేవైఎం లడాయి

**అక్షరశక్తి,వరంగల్:** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా యువ మోర్చా వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో గురువారం కాశీబుగ్గ జంక్షన్‌లో భారీ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పాల్గొన్నారు. రాష్ట్రంలో దాదాపు 40 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని నేతలు ఆరోపించారు. నిరంకుశ పాలనతో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. బకాయిలు అందక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిల చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో



ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నేతలు హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎర్రగొల్ల భరత్‌వీర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల శ్రవణ్, ఆడెపు రవిరామ్, మున్నా, మహాంత్, అభి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కందిమల్ల మహేష్, జిల్లా నాయకులు అంకాల జనార్ధన్, ఇనుముల అరుణ్, మండల అధ్యక్షుడు విప్ప సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంబీఏ, ఎంసీఏ కోర్సులలో స్పాట్ అడ్మిషన్స్

**అక్షరశక్తి, హనుమకొండ:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 2026-27 విద్యా సంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం హనుమకొండ సుబేదారిలోని పీజీ కళాశాలలో ఈ నెల 31వ తేదీ నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం పొందాలనుకునే అభ్యర్థులు నిర్ణీత తేదీల్లో కళాశాలను సంప్రదించాలని ఆమె సూచించారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ విద్యార్హత ధ్రువపత్రాలతో కళాశాలకు హాజరై ప్రవేశ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపల్ నిర్మల కోరారు.







# మట్టిలో మాణిక్యం.. మార్పుకు మార్గదర్శి!

- గ్రామీణాభివృద్ధికి రెండు దశాబ్దాలుగా అంకితభావం
- రైతు సాధికారతే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో కృషి
- జల సంరక్షణ నుంచి సహజ వ్యవసాయం వరకు విస్తృత సేవలు
- 14 రైతు ఉత్పత్తిదారుల సంస్థల బలోపేతంలో కీలక పాత్ర
- సేవలకు పలు పురస్కారాలు.. ఆదర్శంగా నిలిచిన వెంకటస్వామి

**అక్షరశక్తి, జనగామ:**

మట్టిని నమ్ముకున్న రైతు కష్టం తెలుసు.. ప్రకృతిని ప్రేమించిన మనిషికి నేల విలువ తెలుసు.. గ్రామీణ సమాజంతో కలిసి నడిచిన వ్యక్తికే అక్కడి సమస్యల లోతు తెలుసు. ఈ మూడు అనుభవాలను తన సేవా ప్రస్థానానికి పునాదులుగా చేసుకుని రెండు దశాబ్దాలకు పైగా గ్రామీణాభివృద్ధికి అంకితమైన వ్యక్తి మారపాక వెంకటస్వామి. వ్యవసాయం, జల సంరక్షణ, వాటర్‌షెడ్ అభివృద్ధి, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, జీవనోపాధి, శిక్షణ, సహజ వ్యవసాయం తదితర రంగాల్లో ఆయన సాగిస్తున్న కృషి.. ఒక ఉద్యోగి సేవను మించి గ్రామీణ సమాజంలో మార్పుకు బాటలు వేస్తోంది. 2002 నుంచి మోడర్న్ ఆర్కిటెక్ట్స్ ఫర్ రూరల్ ఇండియా (మారి)లో కార్యక్రమ సమన్వయకర్త, సాంకేతిక సహాయకుడిగా పనిచేస్తూ నాబార్డు సహకారంతో అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో కీలకంగా వ్యవహరించారు.

**సహజ వ్యవసాయం వైపు అడుగులు**

నేల ఆరోగ్యం, సహజ వనరుల పరిరక్షణ, రైతు జీవనోపాధి పరస్పరం ముడిపడి ఉన్నాయనే దృక్పథంతో వెంకటస్వామి సహజ వ్యవసాయంపైనా దృష్టి సారించారు. 2025 నుంచి జాతీయ సహజ వ్యవసాయ కార్యక్రమంలో జనగామ జిల్లాకు నోడల్ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూ రైతుల్లో సహజ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. 2024 నుంచి నాబార్డు సహకారంతో సామర్థ్యాభివృద్ధి, ఆయిల్‌పామ్, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల్లోనూ ఆయన భాగస్వామ్యం కొనసాగుతోంది. గణిత శాస్త్రంలో పీజీ, విద్యాశాస్త్రంలో పట్టాతో పాటు విజ్ఞానశాస్త్రంలో పట్టభద్రుడైన ఆయన.. ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, రైతు సంఘాల సమన్వయంలో విశేష అనుభవాన్ని సంపాదించారు. ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని, వారితో కలిసి పరిష్కారాలను అన్వేషించడమే తన సేవా తత్వంగా కొనసాగిస్తున్నారు.



**గుర్తింపులెన్నో.. స్ఫూర్తి ఎందరికో**

వెంకటస్వామి స్వగ్రామం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండ. ఆయన సేవలకు పలు సందర్భాల్లో గుర్తింపు లభించింది. 2025లో జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. 2014లో గ్రామీణ, సామాజిక అభివృద్ధి కార్యక్రమాల్లో సేవలకు ఉత్తమ సామాజిక కార్యకర్త పురస్కారం పొందారు. 2022, 2023లో రాష్ట్రస్థాయి, జాతీయ ప్రదర్శనల నిర్వహణకు నాబార్డు ప్రశంసలు అందుకున్నారు. జల్ జీవన్ కార్యక్రమంలో జిల్లా స్థాయి ఉత్తమ శిక్షకుడిగా పురస్కారం పొందారు. మారి సంస్థ కార్యనిర్వాహక సంచాలకుడు ఆర్.మురళి ప్రోత్సాహం, సంస్థ వ్యవస్థాపకుల ఆశయాలు, జయరామారావు ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకుని గ్రామీణ సమాజం కోసం వెంకటస్వామి సాగిస్తున్న ప్రస్థానం నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. పొలంలో మొదలైన ఆయన ప్రయాణం.. గ్రామీణ సమాజంలో మార్పుగా మారింది. మట్టితో మొదలైన అనుబంధం.. సేవగా వికసించింది. అందుకే మారపాక వెంకటస్వామి.. నిజంగా మట్టిలో మాణిక్యమే!



## రైతు చెంతకే.. పరిష్కార మార్గం

జల సంరక్షణ, వాటర్‌షెడ్ కార్యక్రమాల నుంచి రైతు ఉత్పత్తిదారుల సంస్థల బలోపేతం వరకు వెంకటస్వామి క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేశారు. నాలుగు ఇండో-జర్మన్ వాటర్‌షెడ్ కార్యక్రమాలు, తొమ్మిది వాటర్‌షెడ్ అభివృద్ధి నిధి పథకాల అమలులో బాధ్యతలు నిర్వహించడంతోపాటు 14 రైతు ఉత్పత్తిదారుల కంపెనీలకు కార్యక్రమ సమన్వయకర్తగా సేవలందించారు. సుమారు 20 గ్రామాలు, 60 ఆవాసాల్లో ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లారు. ఆదర్శ గ్రామాలైన గంగాదేవిపల్లి, అంకాపూర్, మహారాష్ట్రలోని హీవరే బజార్, రాళేగాన్ సిద్ధి తదితర ప్రాంతాలను సందర్శించి అక్కడి విజయవంతమైన నమూనాలను అధ్యయనం చేశారు. 2014లో బ్రెజిల్‌లో జరిగిన అంతర్జాతీయ అధ్యయన పర్యటనలోనూ పాల్గొన్నారు.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.

రాజకీయాల్లో ఆస్తులు అమ్ముకున్నా.. అక్రమంగా సంపాదించలేదు!

ఎన్టీఆర్‌తో తొలి పరిచయం నుంచి టీడీపీ ఆవిర్భావంలో కీలక పాత్ర

వర్ధన్నపేట నుంచి హ్యాట్రిక్.. వరంగల్ ఎంపీగా అనూహ్య విజయం

వైఎస్ మంత్రి పదవి ఆఫర్ చేసినా.. కాంగ్రెస్‌లోకి వెళ్లని దయాకర్‌రావు

కేసీఆర్‌తో సాన్నిహిత్యం.. 2018లో ఆరోసారి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి

ఎంజీఎం అభివృద్ధికి ప్రత్యేక చొరవ.. ఆస్పత్రికి రూ.2 కోట్ల నిధుల సమీకరణ

ఎక్కడ అవకాశం వచ్చినా పోటీ చేస్తా.. వారసులను రాజకీయాల్లోకి దింపను

తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్

# పార్టీ.. ప్రజలకోసమే పనిచేసిన

తెలంగాణ రాజకీయాల్లో సుదీర్ఘ ప్రస్థానం.. ఎన్టీఆర్ నుంచి కేసీఆర్ వరకు అగ్రనేతలతో సాన్నిహిత్యం.. ఎమ్మెల్యేగా ఐదుసార్లు విజయం.. అనూహ్యంగా ఎంపీగా గెలుపు.. ఆ తర్వాత మంత్రిగా బాధ్యతలు.. ఇలా నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రయాణాన్ని సాగించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తన జీవితంలోని కీలక ఘట్టాలను తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో పంచుకున్నారు. చిన్ననాటి రాజకీయ ఆసక్తి నుంచి ఎన్టీఆర్‌ను కలిసిన సందర్భం, టీడీపీ ఆవిర్భావంలో తన పాత్ర, వరుస విజయాలు, వైఎస్ ఇచ్చిన మంత్రి పదవి ఆఫర్‌ను తిరస్కరించడం, కేసీఆర్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేయడం, తాజా రాజకీయ పరిణామాల వరకు తన ప్రస్థానాన్ని వివరించారు. "రాజకీయాల్లో ఆస్తులు అమ్ముకున్నానే కానీ అక్రమంగా సంపాదించుకోలేదు" అని స్పష్టం చేసిన దయాకర్‌రావు.. "ఎక్కడ అవకాశం వచ్చినా పోటీ చేస్తా.. రాజకీయ వారసులను దింపే ఆలోచన లేదు" అని భవిష్యత్‌పై తన వైఖరినీ వెల్లడించారు. - అక్షరశక్తి, ప్రధానప్రతినిధి





**రాజకీయాలపై చిన్నప్పటి నుంచే ఇంట్రెస్ట్**

నేను 1956 జూలై 4న పర్వతగిరిలో పుట్టిన. మా అమ్మానాన్నలు ఆదిలక్ష్మిజగన్నాథం. స్థానిక పాఠశాలలోనే చదువుకున్న. రాజకీయాలంటే నాకు చిన్నప్పటి నుంచే ఇంట్రెస్ట్ ఉండేది. పదో తరగతిలో స్కూల్ ప్రెసిడెంట్ ఎన్నికల్లో కూడా పోటీ చేసిన. నాకు పోటీగా బొల్లం సంపత్ కుమార్ అనే మిత్రుడు ఉండే. నేను ఏకగ్రీవంగా ఎన్నికయ్యే పరిస్థితి ఉన్నా.. నేను చేసిన ఓ తుంటరి పని వల్ల ఓడిపోయిన" అంటూ ఆ రోజులను నవ్వుతూ గుర్తు చేసుకున్నారు. "నాకు 18 ఏళ్లకే పెండ్లి అయింది. కేసీఆర్ మామ కేశవరావు దగ్గరుండి సంబంధం చూసి పెండ్లి చేసిండ్లు. నాకు ఒక కూతురు, ఒక కొడుకు" అని చెప్పారు.

**మా నాన్నే రాజకీయాల్లో ఉండేవాడు..**

మా నాన్న ఎర్రబెల్లి జగన్నాథం రాజకీయాల్లోనే ఉండేవాడు. పర్వతగిరి సర్పంచ్‌గా ఆరుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. అప్పుడు సమితిలు ఉండేవి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐదు సమితులు ఉండేవి. మా నాన్న సంగెం సమితి ప్రెసిడెంట్‌గా పోటీ చేస్తే కాంగ్రెస్‌లో ఉన్న అంతర్గత పోరు వల్ల టాస్ వేయాల్సి వచ్చింది. అందులో మా నాన్న ఓడిపోయాడు. ఆ తర్వాత ఓడీసీఎంఎస్ చైర్మన్‌గా పోటీ చేస్తే కాంగ్రెస్‌లోని లొల్లి వల్ల చైర్మన్ పదవి రాలేదు. వైస్ చైర్మన్ పదవి దక్కింది. ఆ తర్వాత వరంగల్ ల్యాండ్ బ్యాంక్ చైర్మన్ అయ్యాడంటూ తన తండ్రి రాజకీయ ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్నారు.

**నన్ను డాక్టర్ చేయాలనేది నాన్న కల**

మా నాన్న నన్ను డాక్టర్ చేయాలని అనుకున్నాడు. పట్టుబట్టి ఎల్‌బీ కాలేజీలో బైపీసీ గ్రూపులో చేర్పించాడు. కాకతీయ మెడికల్ కాలేజీకి దగ్గరలోనే ఉంటుందని.. అక్కడ డాక్టర్లను చూసైనా నాకు డాక్టర్ కావాలనే ఆశ కలుగుతుందని అనుకున్నాడు. కానీ నాకు సదువు అంతగా అబ్బలేదు. దీంతో అగ్రికల్చర్ బీఎస్సీ చదివించాడు. చదువుకునే రోజుల్లో జయశంకర్ సార్ ఇంట్లో నెల రోజుల పాటు ఉన్న. తెలంగాణ ఉద్యమం చేసిన రోజుల్లో దుర్గా టాకీస్ తగలబెట్టిన కేసులో కూడా ఉన్న. కానీ మైనర్‌ను అని ఆ కేసు నుంచి తీసేశారంటూ తన విద్యార్థి దశను గుర్తు చేసుకున్నారు.

**15 ఎకరాల్లో మిర్చి.. అక్కడి నుంచి కాంట్రాక్టర్‌గా..**

వ్యవసాయం అంటే నాకు చాలా ఇష్టం ఉండేది. ఒకసారి 15 ఎకరాల్లో మిర్చి వేసిన. తెగులు వచ్చి బాగా లాస్ అయిన. అక్కడి నుంచి కాంట్రాక్టర్‌గా మారి పనులు చేసిన. ఆర్‌అండ్‌బీ పనులు ఎక్కువగా చేసేవాడిని. రంగశాయిపేట, తీగరాజుపల్లి రోడ్డు నేనే వేశానని చెప్పారు.

**కాంగ్రెస్ కక్షే నాలో కసి పెంచింది**

తన తండ్రి రాజకీయ జీవితంలో కాంగ్రెస్ చేసిన కక్షసాధింపు చర్యలే తనలో రాజకీయ కసి పెంచాయని చెప్పారు. 1982లో ఎన్టీఆర్ పార్టీ పెడుతున్నాడని తెలిసింది. ఆయన చెన్నై నుంచి హైదరాబాద్‌కు వస్తున్నాడని తెలిసి నాలుగు జీపుల్లో కార్యకర్తలను తీసుకొని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లి నిలబడ్డా. ఎన్టీఆర్ ట్రైన్ దిగగానే.. 'జై ఎన్టీఆర్.. జై ఎన్టీఆర్..' అంటూ నినాదాలు చేశా. ఆయన నన్ను.. నా వెనక ఉన్న జనాన్ని చూసి ఎక్కడి నుంచి వచ్చావు బాబు అంటూ పలకరించాడు. కారులో ఆయనతోపాటు తీసుకెళ్లాడు. ఓ హోటల్‌లో టిఫిన్ చేసి.. ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో పార్టీ ఏర్పాటుపై మీటింగ్ ఉంటుందని, రావాలని చెప్పాడు.

**పార్టీ జెండా రూపకల్పనలో నేను..**

టీడీపీ పార్టీ ఏర్పాటు, జెండా రూపకల్పన కోసం ఎన్టీఆర్ పర్వతగిరి ఉపేందర్‌ను కన్వీనర్‌గా, యూత్ తరఫున నన్ను ఎంపిక చేశారు. నేను చురుగ్గా ఉండడంతో ఎన్టీఆర్ నన్ను ప్రత్యేకంగా అభిమానించేవాడు" అని చెప్పారు.

**వరంగల్‌లో ఎన్టీఆర్ సభ..**

ఎన్టీఆర్‌ను వరంగల్‌కు తీసుకురావాలనే ఆలోచన వచ్చింది. దోనపూడి రమేశ్‌బాబు, నేను కలిసి సభా సన్నాహక సమావేశం నిర్వహించినం. రెండు వందల మందికిపైగా ఎన్టీఆర్ అభిమానులు వచ్చారు. ఎన్టీఆర్‌తో వరంగల్‌లో బహిరంగ సభతోపాటు కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించాలని నిర్ణయించాం. బహిరంగ సభకు స్టేజీ, మైక్‌ల కోసం రూ.5 వేలు.. కార్యకర్తల సమావేశానికి రూ.2 వేలు అవుతాయని నిర్ణయించారు. డబ్బులు పెట్టిన వాళ్లే సభకు అధ్యక్షత వహించాలని కూడా చెప్పారు. కానీ ఎవరూ ముందుకు రాలేదు. నేను సభ ఖర్చు పెట్టుకుంటే.. కార్యకర్తల సన్నాహక సమావేశం ఖర్చు రమేశ్‌బాబు పెట్టుకున్నారు. 1982లో ఇస్లామియా గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభ భారీ సక్సెస్ అయింది. ఆ సభ నుంచే ఎన్టీఆర్ నన్ను జిల్లా కన్వీనర్‌గా.. రమేశ్‌బాబును పట్టణ అధ్యక్షుడిగా ప్రకటించాడు.

**మూడు అసెంబ్లీ.. ఒక ఎంపీ టికెట్..**

1983 ఎన్నికల సమయంలో టికెట్ల కేటాయింపు సందర్భంగా ఎన్టీఆర్ నన్ను పిలిచి టికెట్లు ఎంచుకోవాలని అడిగారు. మూడు అసెంబ్లీ, ఒక ఎంపీ టికెట్ ఇస్తే గెలుస్తామని చెప్పిన. నాకు వరంగల్ లేకపోతే వర్ధన్నపేట కావాలని పట్టుబట్టిన. ఆయన నాలుగు బీఫారాలు ఇచ్చారు. అప్పుడు టీడీపీ నుంచి వరంగల్‌లో నిలబడే అభ్యర్థి దొరకలేదు. బండా ప్రకాశ్, గుండా ప్రకాశ్.. ఇలా నలుగురైదుగురిని అడిగితే కొత్త పార్టీ నుంచి పోటీ చేసేందుకు విముఖత చూపించారు. బండారు నాగభూషణ్‌ను అడిగితే రెండు రోజులు తిప్పుకున్నడు. ఆ తర్వాత ఒకే అన్నాడు. ఆయన ఆ ఎన్నికల్లో గెలిచిండు. పార్టీ అధికారంలోకి వచ్చింది. మంత్రి పదవి ఎవరికి ఇవ్వాలని అడిగితే మాచర్ల సత్యనారాయణ బీసీ అని ఆయనకు ఇవ్వాలని సూచించిన అని చెప్పాడు.

**అది ఓడిపోయే సీటని బీ-ఫారం వెనక్కిచ్చిన..**

1985 ఎన్నికల్లో టీడీపీబీజేపీ పొత్తులో వర్ధన్నపేట బీజేపీకి కేటాయించారు. నాకు వర్ధన్నపేటలోనే పోటీ చేయాలని కోరిక. కానీ పొత్తులో ఆ సీటు వెళ్లిపోవడంతో ఎన్టీఆర్ హనుమకొండలో పోటీ చేయమని బీఫారం ఇచ్చారు." "నేను బీఫారం తీసుకొని మెట్లు దిగుతుంటే పార్టీ నాయకుడు ఒకరు చూసి.. 'ఎక్కడ ఇచ్చారు' అని అడిగాడు. హన్మకొండ అని చెప్పిన. ఆయన నవ్వుతూ.. ఓడిపోయే సీటు నీకు ఇచ్చారు అన్నాడు. అప్పుడే వెనక్కిపోయి.. నాకు వద్దని చెప్పి వి. వెంకటేశ్వర రావుకు ఇప్పించిన. ఆయన పోటీ చేసి గెలిచాడు. "ఆ తర్వాత ఎన్టీఆర్ నాపై ఉన్న అభిమానంతో జిల్లా పరిషత్ చైర్మన్ అవకాశం కల్పించాడు. అయితే ఎడబోయిన బస్వారెడ్డి పోటీకి రావడంతో అదీ వదులుకున్న."



**తొలి విజయం.. డీసీసీబీ చైర్మన్‌గా..**

ఎన్టీఆర్ దృష్టిలో నేను ఉండడంతో మళ్లీ 1987లో డీసీసీబీ చైర్మన్‌కు పోటీ చేయాలని చెప్పారు. పర్వతగిరి పీఏసీఎస్ డైరెక్టర్‌గా ఎన్నికయ్యా. కానీ డైరెక్టర్ల సంఖ్యాబలం టీడీపీకి ఎక్కువగా లేదు. కాంగ్రెస్ బలం ఎక్కువగా ఉంది. అయినా నాకున్న వ్యక్తిగత సంబంధాలతో చైర్మన్‌గా ఎంపికయ్యాయని చెప్పారు. ఎన్నికల్లో ఓడిపోయినా.. పదవులు లేకపోయినా పార్టీలో కీలకంగా ఉండేవాడిని. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, త్రీమెన్ కమిటీలో మెంబర్‌గా ఉండేవాడినని చెప్పారు.

**వర్ధన్నపేట నుంచి హ్యాట్రిక్..**

1994లో వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఘన విజయం సాధించిన. 1999లో, 2004లో జరిగిన ఎన్నికల్లోనూ ముచ్చటగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించా. అయితే 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో వరంగల్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎంపీగా గెలిచిన విషయాన్ని ప్రత్యేకంగా గుర్తు చేసుకున్నారు.

**వైఎస్ పిలిచాడు..**
**మంత్రి పదవి ఆఫర్ చేశాడు..**

ఆ సమయంలో కాంగ్రెస్ హవా నడుస్తోంది. వైఎస్‌తోనూ నాకు ప్రత్యేక బంధం ఉంది. ఆయన నన్ను కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ఆహ్వానించాడు. మంత్రి పదవి కూడా ఆఫర్ చేశాడు. కానీ నేను పోలేదని దయాకర్ రావు చెప్పాడు. అప్పుడే ఆయన నాతో ఓ మాట అన్నాడు.. నిన్ను వర్ధన్నపేటలోనే కాదు.. వరంగల్‌లోనూ పోటీ చేయకుండా చేస్తానన్నారు. ఆ తర్వాత జరిగిన డీలిమిటేషన్‌లో వర్ధన్నపేట ఎస్సీకి.. వరంగల్ ఎంపీ కూడా ఎస్సీకి పోయిందన్నారు. వర్ధన్నపేట వదిలిపెట్టాలని ఢిల్లీలో అడిగిన కుదరలేదు. వైఎస్ ఇంట్రెస్ట్ ప్లీజ్ అని నా రిక్వెస్ట్ ను రిజెక్ట్ చేశారు.

**మాస్క్ వేసుకొని పాలకుర్తిలో సర్వే..**

జనరల్ సీట్లు ఉన్న వరంగల్‌తో పాటు పాలకుర్తిలో కూడా సర్వే చేసుకున్న. వరంగల్‌లోనూ గెలుస్తానని వచ్చింది. అయినా పాలకుర్తికి వెళ్లిన. ముఖానికి మాస్క్ వేసుకొని కూలీలతో, ప్రజలతో మాట్లాడి అభిప్రాయాలు సేకరించానని గుర్తు చేసుకున్నారు. మీ దగ్గర కొత్తగా ఎవరు ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని అడిగితే.. దయాకర్ వస్తున్నడట అని చెప్పారు. ఆయన మంచోడని.. గెలిపించుకుంటామని చెప్పడంతో నేను అక్కడికి వెళ్లాలని నిర్ణయించుకున్న. అక్కడికి వెళ్లిన తర్వాత నాకు ప్రజల మద్దతు పుష్కలంగా వచ్చింది. 2009 ఎన్నికల్లో పాలకుర్తి నుంచి ఘన విజయం సాధించిన. 2014లో కూడా గెలిచి.. టీడీపీ నుంచి వరుసగా ఐదుసార్లు శాసనసభకు ఎన్నికైన."


**కేసీఆర్ మంత్రి పదవి ఇస్తానంటే వద్దన్న..**

2014లో టీడీపీ నుంచి గెలిచిన తర్వాత 10 మంది ఎమ్మెల్యేలతో కలిసి టీఆర్ఎస్‌లో చేరానని ఎర్రబెల్లి దయాకర్ రావు చెప్పారు. కేసీఆర్‌తో నాకు అంతకుముందే సన్నిహిత సంబంధం ఉండేది. పార్టీలో చేరిన వెంటనే నాకు మంత్రి పదవి ఇస్తానన్నాడు. కానీ పార్టీ గుర్తుపై గెలిచిన తర్వాతే మంత్రి పదవి తీసుకుంటానని చెప్పిన. 2018లో ఆరవసారి టీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణాభివృద్ధి, నీటి సరఫరా శాఖల మంత్రిగా నియామకం అయ్యా. నా శాఖల నుంచి మంచి పనులు చేసినం. ఎన్నో అవార్డులు సాధించినమని తెలిపారు.



**ఆదో వడ్డాణం కథ..**

టీడీపీ రోజుల్లో ఎన్టీఆర్ తనకు మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించిన సందర్భాన్ని కూడా దయాకర్ రావు గుర్తు చేసుకున్నారు. టీడీపీలో ఎమ్మెల్యేగా గెలువగానే నన్ను ఎన్టీఆర్ పిలిచి మంత్రి పదవి ఇస్తానని చెప్పారు. అయితే నేను ఎన్టీఆర్‌లక్ష్మీపార్వతి పెళ్లికి నిరాకరించిన. నెల రోజుల పాటు ఆపిన. ఆ కుట్ర ఉండేది. ఆ తర్వాత ఒక రోజు ఎన్టీఆర్ ఇంటికి వెళ్లితే లక్ష్మీపార్వతి.. 'నేను నీకు మంత్రి పదవి ఇప్పిస్తానని చెప్పాను కదా.. నాకు ఒక వడ్డాణం చేయించు' అని కోరారు. దీంతో వడ్డాణం లేదు.. ఏమీ లేదు.. మంత్రి పదవి వద్దు అంటూ వచ్చేసిన. ఇది నేను గొప్పగా చెప్పుకోవడం కాదు. ఈ ఘటనను చూసిన అప్పటి ఎన్టీఆర్ డ్రైవర్ ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో కూడా చెప్పాడు" అని అన్నారు. ఎన్టీఆర్ దగ్గరకు రెగ్యులర్‌గా వెళ్లేవాళ్లలో నేను, జస్టిస్ రమణ ఇద్దరమే. ఉదయమే ఆయన దగ్గరికి వెళ్లి పార్టీ, ప్రభుత్వ విషయాలు చెప్పేవాళ్లం. మాకే ఆయన కూడా ఆ అవకాశం ఇచ్చేవాడని చెప్పారు.



**ఎంతో మందిని టీడీపీలోకి తీసుకొచ్చిన..**

"టీడీపీలోకి నేను ఎంతో మందిని తీసుకొచ్చిన. సీతక్క, రేవూరి ప్రకాశ్‌రెడ్డిని ఆహ్వానించి ప్రోత్సహించిన. జిల్లాలోనే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా గంగుల కమలాకర్, విద్యాసాగర్‌రావు, మాగంటి గోపినాథ్‌తోపాటు ఆంధ్రాలో కూడా చాలా మందికి టికెట్లు ఇప్పించిన. ఎన్టీఆర్‌కు ఎంసీపీఐయూతో పొత్తు పెట్టుకోవాలని ఆసక్తి ఉండేదని, ఆ పార్టీ నేత ఓంకార్‌తో మాట్లాడాలని తనకు చెప్పారని తెలిపారు. మూడు నాలుగు సార్లు మాట్లాడిన. మూడు టికెట్లు ఇస్తామని చెబితే ఆయన నాలుగు అడిగిండు. దీంతో 1994లో నర్సంపేటలో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని నిలబెట్టినం. ఆయన గెలిచిండని చెప్పారు.

**ఎంజీఎం అంటే నాకు ప్రత్యేక ఇష్టం..**

ఎంజీఎం దవాఖానను డెవలప్ చేయాలని నాకు చాలా కాయస్ ఉండేది. చాంబర్ ఆఫ్ కామర్స్ వాళ్లతో మాట్లాడి రూ.20 లక్షలు చేసి ఆస్పత్రిలో కొత్త బెడ్లు వేయించిన. కేఎంసీలో చదువుకున్న వాళ్లతో ఉన్న పరిచయాలతో రూ.2 కోట్లు ఆస్పత్రి కోసం తెచ్చి ఆడిటోరియం కట్టించిన. ఎంజీఎంను డెవలప్ చేసిన. ఎంజీఎంను అభివృద్ధి చేసిన తీరుకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అసెంబ్లీలోనే నన్ను పొగిడారు అంటూ దయాకర్ రావు గుర్తు చేసుకున్నారు.

**అది దుబాయ్ మోడల్..**

కేసీఆర్‌కు ఆస్పత్రులు మెరుగ్గా ఉండాలని ఉంటుంది. అందుకే వరంగల్ సెంట్రల్ జైలు స్థలంలో మల్టీలెవల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం చేపట్టారు. ఆ మోడల్‌ను దుబాయ్ వెళ్లినప్పుడు చూసి.. సేమ్ టు సేమ్ నిర్మాణం మొదలుపెట్టారని చెప్పారు.

**ఎంపీగా గెలవడం ఒక వండర్..**

2008లో నేను ఎంపీగా గెలవడం ఒక చరిత్ర. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎస్టీలు, రెడ్డీలు ఎక్కువ మంది ఉండేవారు. కాంగ్రెస్ హవా నడుస్తోంది. జిల్లాలో నేను ఒక్కడినే ఎమ్మెల్యేను. అంతా కాంగ్రెస్ ఎమ్మెల్యేలే." "నేను నిలబడనని చంద్రబాబుకు చెప్పిన. కానీ ఆయన వినలేదు. కాంగ్రెస్ నుంచి రమేశ్ రెడ్డి బరిలో ఉన్నారు. అంతా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండడంతో ఆయనే గెలుస్తారని అనుకున్నారు. కానీ నాకు ప్రతి ఊళ్లో పరిచయస్తులు ఉంటారు. ప్రజలు నాకు బ్రహ్మరథం పట్టారు. ఎవరూ ఊహించని విధంగా గెలిచిన" అని చెప్పారు.

**చంద్రబాబుతో లెటర్ ఇప్పించా..**

తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసినప్పుడు నేను కూడా ఉద్యమంలో పాల్గొన్న. జయశంకర్ సార్ పిలిచి నన్ను చంద్రబాబు నాయుడి నుంచి ఢిల్లీకి లెటర్ రాయించమని చెప్పాడు. బాబు వద్దకు వెళ్లి అడిగిత మొదట నిరాకరించడంతో నేను పది మంది ఎమ్మెల్యేలతో రిజైన్ చేస్తా. తెలంగాణ ఉద్యమం ఊపుమీద ఉందని చెప్పిన. వెంటనే ఆయన తెలంగాణకు అనుకూలంగా లెటర్ ఇచ్చారు.



**అందరూ 'దయన్న' అంటరు..**

నన్ను ఎక్కడికి పోయినా.. అప్పడైనా ఇప్పడైనా అంతా దయన్న.. దయన్న అని పిలుస్తుంటారు. చంద్రబాబు పాదయాత్ర సమయంలో జిల్లాలో ఎక్కడికి వెళ్లినా దయన్న.. దయన్న అంటూ నినాదాలు చేసేవారు. పర్వతగిరిలో మాత్రం దొర అని అంటరు. దీన్ని చూసి చంద్రబాబు షాక్ అయ్యాడు. అంతటా దయన్న అంటే.. ఇక్కడ ఒక్కకాడనే ఇలా ఎందుకు అంటున్నారని అడిగాడు. నేను అందరితో కలిసిపోతా. ఉదయం 5 గంటలకు లేచి.. 6 గంటల నుంచే ప్రజలకు అందుబాటులో ఉంటా. వాళ్ల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటా. అందుకే అంత అభిమానం అని చెప్పారు.

**రాజకీయాల్లో ఆస్తులు అమ్ముకున్నా..**

"మాకు ఒకప్పుడు 500 ఎకరాల వరకు ఉండేది. నేను రాజకీయాల్లో ఆస్తులు అమ్ముకున్నానే కానీ అక్రమంగా సంపాదించుకోలేదు. 200 ఎకరాల వరకు ఇప్పటికీ మా పేరు మీద ఉంటే.. ఇటీవలే కబ్జాలో ఉన్నవారికి రాసి ఇచ్చాం. నాకు సాయం చేయడమే తెలుసు" అని చెప్పారు.

**భార్య సపోర్ట్ పుష్కలం..**

నా భార్య ఉషా సపోర్ట్ నాకు పుష్కలంగా ఉంటుంది. ఎర్రబెల్లి ట్రస్ట్‌ను ఆమెనే చూసుకుంటుంది." "ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతాం. కుట్టు మిషన్లు, నిరుద్యోగులకు కోచింగ్, 200 వాటర్ ప్లాంట్లు, డ్రైవింగ్ లైసెన్సులు.. ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నాం" అని చెప్పారు.

**ఎక్కడ అవకాశం వచ్చినా పోటీ చేస్తా..**

భవిష్యత్ రాజకీయాలపైనా దయాకర్ రావు తనదైన శైలిలో స్పందించారు. "డీలిమిటేషన్‌లో స్థానాలు మారడం పక్కా. నేను ఎక్కడ అవకాశం వచ్చినా పోటీ చేస్తా. కానీ రాజకీయాల్లోకి వారసులను దింపే ఆలోచన లేదు" అని స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో తన ఓటమి గురించి కూడా మాట్లాడారు. "2024 ఎన్నికల్లో నేను ఓడిపోతానని ఆరు నెలల ముందే తెలుసు. ఈ విషయం కేసీఆర్‌కు కూడా చెప్పిన. నాకు వేరే స్థానం కావాలని అడిగిన. కానీ అలా జరగలేదు." "ఎన్ని రోజులు దయాకర్ రావే అనే మాట వచ్చింది. అందుకే ఓడిపోయిన" అంటూ తన రాజకీయ ప్రయాణంలోని తాజా మలుపును కూడా అంతే నిర్మొహమాటంగా చెప్పుకొచ్చారు.